# జ్యోతిషం ఆధారం

గంగదేశం వాళ్లకు గంగపురాణం ఉన్నది. అదే వాళ్లకు చరిత్రా, పవిత్ర గ్రంథం కూడానూ. గంగ ఆ దేశానికి మూలదేవత. ముప్పై ఏళ్ల క్రితం దాకా గంగను గురించి అంతగా ఎవరూ పట్టించుకోలేదు. గంగకు భర్తలేదనీ, అనేకమంది భర్తలున్నారనీ, పిల్లలున్నారనీ, లేరనీ, గంగ అంటే సీత అనీ, కాదు లక్ష్మీదేవి అనీ, భయంకరమైన వ్యాధులకు మూలదేవత అనీ, ఆరోగ్యాన్నీ, దీర్ఘాయువునూ ఇచ్చేదనీ, రకరకాల నమ్మకాలు ప్రజలలో ఉండేవి. చదువుకున్నవాళ్లు ఏదీ నమ్మే వాళ్లుకారు.

అయితే గంగదేశంలో రాజకీయ - సామాజిక పరిస్థితి అధ్వాన్నమైనది. మొదట గంగపురాణం గురించి అందరికీ వల్లమాలిన ఆసక్తి పుట్టుకొచ్చింది. అన్ని పురాణాలలాగే దాన్ని కూడా వ్యాసుడు రాశాడన్నారు. అందులో ధూమశకటాలూ, ఆకాశ శకటాలూ ఉన్నాయి. ద్వాపరయుగంలో అవి ఉన్నాయని శాస్త్రులుగార్లు వాదించారు.

గంగ పుట్టినరోజూ, నక్షత్రమూ, తిథీ, ఘడియా గంగపురాణంలో వ్యాసుల వారు ఇచ్చారు. దాన్ని బట్టి అంచనా వెయ్యగా గంగ 39,542 ఏళ్ల క్రితం పుట్టి ఉండాలి; లేదా 3,954 ఫిబ్రవరి 5న అయినా పుట్టబోతుంది. గంగపురాణం భవిష్యపురాణం కాదు గనక పాత తేదీ ఖాయం చేసి, గంగ నివసించిన ఏడంతస్తుల మేడకోసం త్రవ్వకాలు ప్రారంభించారు.

"ఈ దెబ్బతో గంగ సంగతి అటో ఇటో తేలుతుంది," అన్నారు గంగ మేధావులు. కాని అది నిజం కాదు. గంగ పురాణానికున్న పవిత్రత ఆర్కియాలజీకి ఎక్కడిది?

***ముద్రణ : యువ, 1977?***